
www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 1 జూన్ 2023
5
అన్నమయ్య



ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య


అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపల్ లక్ష్మీదేవి, అధ్యాపక బృందం

రాజంపేట అర్బన్ : ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ప్రిన్సిపల్ బి.లక్ష్మీదేవి తెలిపారు. బుధవారం పాఠశాల కమిటీ అధ్యక్షులు ఎస్ఎండి కరీం, అధ్యాపకులు నీలకంఠేశ్వరరావు, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, అడ్వకేట్ ముజఫర్ అహ్మద్‌లతో కలిసి రాజంపేట పట్టణంలోని పలు ప్రాంతాలలో తిరిగి ప్రభుత్వ పాఠశాలలో విద్య పట్ల తల్లిదండ్రులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ లక్ష్మీదేవి మాట్లాడుతూ గత ఏడాది జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నందు ఇంటర్మీడియట్ తరగతులు ప్రారంభించారని, ఇందులో ఎంపిసి, సిఇసి గ్రూపులలో అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు. తల్లిదండ్రులకు ఫీజుల భారం లేకుండా విద్యార్థినులకు ఉచితంగా నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. కళాశాలలో గ్రంథాలయం, ల్యాబ్ సౌకర్యంతో పాటు అనుభవజ్ఞులైన అధ్యాపక బృందంచే ఉత్తమ బోధన అందించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు, విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రిజిస్ట్రేషన్ ఛార్జీల ధరవు



జిల్లాలో రిజిస్ట్రేషన్ చార్జీల పెంపుదలకు రంగం సిద్ధమైంది. ప్రభుత్వం నెల రోజుల కిందటి నుంచి రిజిస్ట్రేషన్ ఛార్జీలను పెంచనున్నామని హెచ్చరిస్తున్న సంగతి తెలిసిందే. వ్యవసాయ భూములు మొదలుకుని మున్సిపాలిటీల్లోని స్థలాలు, ఎన్‌హెచ్ జాతీయ రహదా రులను ఆనుకుని ఉన్న స్థలాలు, భూములకు 30 శాతం చొప్పన ధరలు పెరగనుండడం గమనార్హం. గురువారం నుంచి పెరగనున్న రిజిస్ట్రేషన్ ఛార్జీల ధరలు అమల్లోకి రానుండడం ఆందోళన కలిగిస్తోంది.

30 శాతం ధరల పెంపు - నేటి నుంచి అమల్లోకి..

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

కడప, అన్నమయ్య జిల్లాల్లో 12 చొప్పున 24 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలోని మున్సిపల్ స్థలాలకు, వ్యవసాయ భూములకు, జాతీయ రహదారి ఆధారిత భూములకు, ఇతర కమర్షియల్ స్థలాలకు 30 శాతం చొప్పున ధరలు పెరగను న్నాయి. ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. కడప జిల్లాలో కడప, ప్రొద్దుటూరు, మైదుకూరు, జమ్మలమడుగు, కమలాపురం, యర్రగుంట్ల, పులివెందుల, బద్వేల్, రాజంపేట, రైల్వేకోడూరు మున్సిపాలిటీలు, అన్నమయ్య జిల్లాలోని రాయచోటి, రాజంపేట, మదనపల్లి, తదితర మున్సిపాలిటీల్లో క్రయ, విక్రయాలు జోరుగా సాగుతున్న సంగతి తెలిసిందే. వీటి పరిధిలోని స్థలాలు, వ్యవసాయ భూములు, ఎన్‌హెచ్ ఆధారిత స్థలాలు, భూ ములు పెద్దఎత్తున ఉన్నాయి. కమర్షియల్ వ్యవహారం ముడిపడిన నేపథ్యంలో ప్రతి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో వందలాది రిజిస్ట్రేషన్ల కార్యకలాపాలు సాగుతున్న సంగతి తెలిసిందే. వీటితోపాటు కమర్షియల్ ప్రాధాన్యత కలిగిన కొన్ని గ్రామీణ ప్రాంతాల్లోని స్థలాలకు, వ్యవసాయ భూములకు, జాతీయ రహదారి ఆధారిత భూములకు, ఇతర కమర్షియల్ స్థలాలకు ధరలు పెరగనున్నాయి. ప్రతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ప్రభుత్వం సుమారు రూ.40 కోట్ల నుంచి రూ.60 కోట్ల ఆదాయ సముపార్జనే లక్ష్యాల్ని నిర్దేశించిన సంగతి తెలిసిందే. తాజా రిజిస్ట్రేషన్ ఛార్జీల ధరల పెరుగుదల నేపథ్యంలో అటు ప్రజల్లోనూ, ఇటు రిజిస్ట్రార్ కార్యాలయ అధికారుల్లో సైతం నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తుండడం గమనార్హం.

బోగస్ భాగోతంపై విచారణేది?



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

వైద్య ఆరోగ్య శాఖ బోగస్ బాగోతం విచారణపై నిర్లక్ష్యం రాజ్యం మేలుతోంది. 2022 నవంబర్, డిసెంబర్ మాసాల్లో చేపట్టిన 291 స్టాఫ్‌నర్స్ పోస్టుల భర్తీలో సర్టిఫికెట్ల పరిశీలన వ్యవహారం సక్రమంగా చేపట్టకపోవడంతో సుమారు 21 మంది అనర్హులకు ఉద్యోగాలు లభించడంపై అప్పట్లో గందరగోళం నెలకొన్న సంగతి తెలిసిందే. చిత్తూరు జిల్లా పూతలపట్టు ప్రాంతానికి చెందిన ఓ స్టాఫ్‌నర్స్ నియామకం విషయంలో చోటుచేసుకున్న నిర్లక్ష్యపు ఉదంతానికి సూపరింటెండెంట్‌పై సస్పెన్షన్ వేటుపడింది. ఆయనపై అప్పట్లో పోలీస్ కేసు కూడా నమోదు చేసిన సంగతి తెలిసిందే. నిజానిజాలను విచారణ చేసి తదుపరి చర్యలు తీసుకోవాల్సి ఉంది. సుమారు ఆర్నెళ్లుగా పోలీస్, డిపార్టుమెంట్ విచారణల్లో ఎటువంటి కదలిక లేకపోవడంతో సస్పెన్షన్‌లోనే మగ్గుతున్నట్లు సమాచారం. విచారణ కమిటీలో సస్పెన్షన్ చేసిన పూర్వ ఆర్‌డి, ప్రిన్సిపల్ సెక్రటరీ, డిప్యూటీ ప్రిన్సిపల్ సెక్రటరీలు సంయుక్తంగా విచారణ చేపట్టాల్సి ఉంది. ఎస్ఆర్ రిమార్క్స్ పరిశీలన, ఇతర శాఖాపరమైన క్రమశిక్షణ తదితర రిమార్క్స్‌ను పరిశీలన చేసే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. విచారణ అనంతరం ప్రభుత్వ నిబంధనల మేరకు గతంలో పనిచేసిన ప్రదేశంలో గాకుండా ఇతర ప్రాంతాలకు బదిలీ చేయాల్సి ఉన్నట్లు సమాచారం. విచారణే చేపట్టని నేపథ్యంలో బోగస్ బాగోతంపై విచారణలో ఎప్పటికి కదలిక వస్తుందో తెలియడం లేదు.

విచారణ చేపట్టాం

ఆర్‌డి సూప రింటెండెంట్‌పై విచారణ చేపట్టాం. పూర్వ ఆర్‌డి డాక్టర్ కోటేశ్వరి చెన్నైలో ఉన్న కారణంగా హాజరు కాలేనని తెలిపారు ప్రిన్సిపల్ సెక్రటరీ, డిప్యూటీ ప్రిన్సిపల్ సెక్రటరీ అధికారులు విచారణ చేపట్టారు. విచారణ అనంతరం ఇచ్చే రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశాలను అమలు చేస్తాం.

- డాక్టర్ అనిల్‌కుమార్, ఆర్‌డి, కడప.


కరాటే శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

కరాటే శిక్షణతో మానసిక ఉల్లాసం

మదనపల్లె అర్బన్: కరాటే శిక్షణ ద్వారా చిన్నారుల్లో మానసిక ఉల్లాసాన్ని ఇస్తుందని డాక్టర్ పాల్ రవికుమార్, జిల్లా శాప్ చీఫ్ కోచ్ షేక్ షఫీ, టూ టౌన్ హెడ్‌కానిస్టేబుల్ రామమూర్తి పేర్కొన్నారు. బుధవారం హోప్ మున్సిపల్ హైస్కూల్‌లో యూత్ కరాటే, స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి కరాటే శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు తాము నేర్చుకున్నా విద్యను ప్రదర్శించి అబ్బుర పరిచారు. చిన్నారుల ప్రదర్శన ఎంతో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా డాక్టర్ పాల్ రవికుమార్ మాట్లాడుతూ స్పోర్ట్స్ ఆథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, జిల్లా క్రీడాభివృద్ధి ప్రాధికారిత సంస్థ, మదనపల్లె యూత్ కరాటే, స్పోర్ట్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో వేసవి కరాటే శిక్షణ శిబిరం నిర్వహించడం ఎంతో శుభపరినామమని పేర్కొన్నారు. డాక్టర్ ఎ.ఆర్. సురేష్ ఆధ్వర్యంలో మలేషియాలో బంగారు పతకాలు సాధించడం గర్వకారణమన్నారు. చీఫ్ కోచ్ షఫీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి క్రీడలను ఎంతో ప్రోత్సహిస్తూ, అందుకు కావససిన మౌలిక సదుపాయాల కల్పించడం జరుగుతోందని వెల్లడించారు. గ్రాండ్ మాస్టర్ సురేష్ మాట్లాడుతూ వేసవిలో ప్రతిఒక్కరూ కరాటే నేర్చుకోవాలనే సదుద్దేశంతో 40 రోజుల పాటు శిక్షణ శిబిరం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో యూత్ కరాటే అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.మణిసాయి, లయన్స్ అభయ సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, మాస్టర్లు రమణ, మహేశ్వర, మిస్బా, గిరిష్మ, శిశిర, అనిత్‌కృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి : ఎంపిపి

రాజంపేట అర్బన్: అధికారులందరూ చిత్తశుద్ధితో పనిచేసి ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపిపి వెంకట నారాయణ అన్నారు. బుధవారం ఎంపిపి అధ్యక్షతన సభా భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. స్పందన కార్యక్రమంలో వచ్చే ఆర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ప్రభుత్వం పట్ల ప్రజలకు సానుకూల దృక్పథం ఏర్పడేందుకు అధికారులదే కీలక బాధ్యతని పేర్కొన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమం పట్ల ప్రజాప్రతినిధులు, గ్రామ స్థాయి అధికారులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. సమావేశంలో కార్యక్రమంలో ఎంపిడిఒ బాలమునిస్వామి, తహశీల్దార్ సుబ్రహ్మణ్యంరెడ్డి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అందుబాటులో వేరుశనగ విత్తనాలు

వాల్మీకిపురం: ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న వేరుశనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో రైతులకు వేరుశనగ విత్తనాల పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు సకాలంలో వేరుశెనగ విత్తనాలను విత్తుకొని పంటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడిఏ వాణిశ్రీ, ఏఓ హేమలత, ఆర్‌బికే చైర్మన్ నీళ్ల భాస్కర్, ఉప సర్పంచ్ కేశవరెడ్డి, నాయకులు చింతల ఆనందరెడ్డి, రఘు, వెంకట్రమణ, కిరణ్‌కుమార్, శివారెడ్డి పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, భోజనం అందజేత

రాజంపేట అర్బన్: హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, భోజన పొట్లాలు పంపిణీ చేశారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు భోజన సదుపాయం నిలిపివేయడంతో గత కొంతకాలంగా హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రోగులకు భోజనాన్ని అందజేస్తున్నారు. ఇందులో భాగంగా తొమ్మిదవ రోజు ఆసుపత్రి లో రోగులతో పాటు వారితో పాటు ఉన్న సహాయకులకు కూడా భోజనం పంపిణీ చేసినట్లు సంస్థ ప్రతినిధి పి.వెంకటరమణ తెలిపారు. అలాగే బాటసారులకు భోజనం, పండ్లు, మంచి నీరు అందించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో వ్యధ్యాధికారులు, ఆసుపత్రి సిబ్బంది, హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపు విభిన్నప్రతిభావంతులకు ప్రత్యేక శిబిరం

మదనపల్లె అర్బన్: అన్నమయ్య జిల్లా, ప్రత్యేక ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరు కార్యాలయ ప్రాంగణంలో 2వ తేదీ కృత్రిమ కాళ్లను అమర్చే ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు వెలుగు సెక్రటరీ ఎం.ఉదయ్ మోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఇంతవరకూ జైపూర్ కృత్రిమ కాళ్ళను అమర్చేవారని, ప్రస్తుతం తేలికపాటి హైడ్రాలిక్ మెటీరియల్‌తో తయారు చేసిన కృత్రిమ కాళ్లను ఉచితంగా అమర్చడానికి చెన్నైకి చెందిన ఒక సంస్థ ముందుకు వచ్చిందని పేర్కొన్నారు. కృత్రిమ కాళ్ల అవసరమైన వారు ఆధార్ కార్డు రేషన్ కార్డు, సదరం సర్టిఫికెట్, రెండు ఫోటోలు తీసుకొని శిబిరానికి హాజరు కావాల్సినదిగా కోరారు.

ఇసుక అక్రమాలపై ఉక్కుపాదం

పాదయాత్రలో నారా లోకేష్

దారిపొడవునా లోకేష్ దృష్టికి సమస్యల వెల్లువ

ప్రొద్దుటూరులో ఘన స్వాగతం


ప్రొద్దుటూరు నిర్వహించిన లోకేష్ యువగళం పాదయాత్రకు భారీ సంఖ్యలో హాజరైన ప్రజలు

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్/ప్రొద్దుటూరు పుట్టపర్తి సర్కిల్

తెలుగుదేశం ప్రభుతం అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్నానదిలో ఇసుక అక్రమ తవ్వకాలపై ఉక్కుపాదం మోపుతామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 112వ రోజుకు చేరుకుంది. బుధవారం వైఎస్ఆర్ జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గంలోని దేవగుడి విడిది కేంద్రం నుంచి సలివెందుల, దేవగుడి గ్రాస్ మీదుగా ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని చౌడూరులోకి ప్రవేశిస్తుంది. అక్కడి నుంచి శంకరాపురం, పెద్దశెట్టిపల్లె, నరసింహాపురం, చౌటపల్లి విడిది కేంద్రం వరకూ పాదయాత్ర సాగింది. ఆయా ప్రాంతాల్లో పద్మశాలి సామాజిక వర్గీయులు, స్థానికులు, రైతులు, ఎంఆర్‌పిఎస్ నాయకులుతో ముఖాముఖి, మాటామంతి, సమావేశాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పాదయాత్ర సందర్భంగా పలుచోట్ల లోకేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇసుక మొత్తాన్ని జగన్ అండ్ కో పొరుగు రాష్ట్రాలకు తరలిస్తూ అడ్డగోలు దోపిడీకి తెరలేపారని తెలిపారు. నాలుగేళ్లలో ముఖ్యమంత్రి జగన్ ఇసుకపై రూ.10 వేల కోట్లు దోచుకున్నారని విమర్శించారు. ఇసుక మాఫియా కారణంగా అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి 61 మంది అమాయకులు బలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొద్దుటూరు, పరిసర గ్రామాల ప్రజల తాగునీటికి ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. ఇసుక పాలసీని సరళతరం చేసి స్థానికంగా ప్రజలకు ఇసుకను అందుబాటులోకి తెస్తామని తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే చేనేతపై ఉన్న 5 శాతం జీఎస్టీ భారం పడకుండా చేస్తామని తెలిపారు. టిడ్కో ఇళ్లు, కామన్ వర్కింగ్ షెడ్లు ఏర్పాటు చేస్తామన్నారు. చంద్రన్న భీమా పథకాన్ని మళ్లీ ప్రవేశ పెడతామని పేర్కొన్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత మగ్గాల సంఖ్య తగ్గిపోయిందన్నారు. ప్రభుత్వం నుండి సాయం లేక చేనేత కార్మికులు ఇతర రంగాలకు వెళ్లిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మగ్గం ఉన్న చేనేత కార్మికులకు 200 యూనిట్ల విద్యుత్ అందజేస్తామన్నారు. చేనేత క్లస్టర్స్ ఏర్పాటు చేసి ప్రత్యేక బ్రాండింగ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. జగన్ నిర్వాకం కారణంగా గ్రామాల్లో కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లడానికి కూడా పంచాయతీల వద్ద నిధుల్లేని పరిస్థితి నెలకొందన్నారు. పలువురు సర్పంచ్‌లు పరువు కోసం సొంత డబ్బులు ఖర్చుపెట్టి పనులుచేసి, బిల్లులు రాక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తామన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగం కుదేలైందన్నారు. అసమర్థ విధానాలతో రైతాంగం ఆత్మహత్యల్లో ఏపీని దేశంలోనే ముందు వరుసలో నిలిపారని తెలిపారు.. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శివనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, టిడిపి కడప పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు మల్లెల లింగారెడ్డి, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జులు భూపేష్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో లోకేష్‌కు ఘన స్వాగతం

జమ్మలమడుగు నియోజకవర్గం నుంచి ప్రొద్దుటూరులోకి లోకేష్ యువగళం పాదయాత్ర ప్రవేశించించిన సందర్భంగా ఆయనకు జివి ప్రవీణ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి నాయకులు ఘన స్వాగతం పలికారు. లోకేష్‌కు స్వాగతం పలికేందుకు పెద్ద సంఖ్యలో మహిళలు తరలివస్తున్నారు.. లోకేష్‌తో సెల్ఫీలు దిగేందుకు మహిళలు, యువకులు పోటీపడ్డారు. అందరిని ఆప్యాయంగా పలకరిస్తూ వారితో సెల్ఫీలు దిగారు. స్వాగతం పలికిన వారిలో ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యేలు వరదరాజులరెడ్డి, లింగారెడ్డి, టిడిపి నాయకులు సురేష్ నాయుడు, ముక్తియర్, ఇవి సుధాకర్‌రెడ్డి తదితర నాయకులు ఉన్నారు.

అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

జగనన్నకు చెబుదాం స్పందన అర్జీల ఎండార్స్‌మెంట్ నాణ్యతగా ఉండాలని కలెక్టర్ గిరీష తహశీల్దార్లను ఆదేశించారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్ నుంచి జగనన్నకు చెబుదాం అర్జీలను నాణ్యతగా పరిష్కరించడంపై ఆర్‌డిఒలు, తహశీల్దార్లతో వీడియోకాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్‌డిఒ, తహశీల్దార్ లాగిన్‌లలో ఉన్న రీఓపెన్ అర్జీలను వెంటనే పరిష్కరించాలన్నారు. సదరు అర్జీలను మరొకసారి క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారుడు ఏ సమస్య లేవనెత్తాడు, అందుకు సరైన విధంగా పరిష్కారం చూపాలి, ఒకవేళ చర్య తీసుకోలేకపోతే ఎందుకు తీసుకోలేకపోతున్నామన్న వివరాలను స్పష్టంగా అర్జీదారునికి తెలియజేయాలన్నారు. నాణ్యమైన నివేదికను, అందుకు సంబంధించిన ఫోటోలు స్పందన ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా వివిధ మండలాలకు సంబంధించి రీఓపెన్ అయిన అర్జీలలో తహశీల్దార్లు ఏ విధంగా ఎండార్స్‌మెంట్ ఇచ్చారు, అర్జీదారుడు తిరిగి దానిని ఎందుకు రీఓపెన్ చేశారని ఏవిధంగా ఎండార్స్‌మెంట్ చేయాలనే విషయంపై కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. అర్జీలను నిర్ణీత కాలపరిమితిలోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. బియాండ్ ఎస్ఎల్ఎలోకి వెళ్లరాదని చెప్పారు. ఆర్‌డిఒలు తమ పరిధిలో రీఓపెన్ అవుతున్న అర్జీలను ఎప్పటికప్పుడూ పరిశీలించి నాణ్యమైన ఎండార్స్‌మెంట్ జారీచేసే విషయంలో తహశీల్దార్లకు తగు సూచనలు జారీ చేయాలని పేర్కొన్నారు. అంతకుముందు రాజంపేట డివిజన్‌కు సంబంధించి అసైన్మెంట్ భూముల ప్రగతిపై సంబంధిత డివిజన్ తహశీల్దార్లతో కలెక్టర్ సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి స్థలాన్ని కేటాయించాలని వినతి

ప్రజాశక్తి-రాయచోటి

ఆంధ్రప్రదేశ్‌లో జిల్లా విభజన అనంతరం అన్నమయ్య జిల్లాలో జాతీయ కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాల కోసం భవనాన్ని నిర్మించుకునేందుకు స్థలాన్ని కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఎస్.అల్లా బకాష్ సిఎల్‌పి ఆధ్వర్యంలో కలెక్టర్ గిరీ షా పిఎస్ కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అల్లా బకాస్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ లీడర్ల సమావేశం కావడానికి వీలయ్యే విధంగా భవనాన్ని నిర్మిస్తామని అందుకోసం స్థలాన్ని కేటాయించాలని తెలియజేశారు. పార్టీ కార్యకర్తలతో, స్థానిక నాయకులతో కలవడానికి వచ్చిన జాతీయ పార్టీ నాయకులు సమావేశాలు ఏర్పాటు చేయడానికి పార్టీ కార్యాలయం లేక చాలా ఇబ్బందికరంగా ఉందని తెలిపారు. ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించాలని వారు కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి ఖదీర్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు చెన్నకృష్ణ ,రామాపురం మండల అధ్యక్షులు మైసూరా రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఖాదర్ ఖాన్ జిల్లా ఆర్‌టిఐ చైర్మన్ అమీర్, యూత్ అధ్యక్షులు దినకర్ పాల్గొన్నారు.


కలెక్టర్ గిరీషకు వినతిపత్రం సమర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


మాట్లాడుతున్న ఎపి ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రరెడ్డి

బిటి కళాశాలకు యూనివర్సిటీ స్థాయి

- ఎపి ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

బిటి కళాశాల యూనివర్సిటీ ఏర్పాటుపై ఒకటిన్నర నెలల్లో డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్‌ను ప్రభుత్వానికి అందిస్తామని ఆంధ్ర ప్రదేశ్ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం మదనపల్లిలో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషాలతో కలసి అయన బిటి కళాశాలలో పర్యటించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ బిటి కళాశాల ఘణ చరిత్రను దృష్టిలో ఉంచుకొని, ఈ కళాశాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలనే వివిధ సంఘాలు ఒత్తిడి చేసిన నేపథ్యంలో స్వతంత్ర ఉద్యమంలోనూ కళాశాల పోషించిన పాత్ర మిథున్‌రెడ్డి, నవాజ్ బాషాల విజ్ఞప్తి మేరకు కళాశాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం జరిగిందని వెల్లడించారు. రవీంద్రనాథ్ ఠాగూర్ బెంగాల్ నుంచి ఆంగ్లంలోకి మదనపల్లి బిటి కళాశాలలో జాతీయ గీతాన్ని తర్జుమా చేసి బాణీలు కట్టిన చరిత్ర సొంతం చేసుకున్నదని గుర్తు చేశారు. బిటి కళాశాల పూర్వ వైభవానికి తగినట్టుగా ప్రభుత్వం అభివృద్ధి చేయటానికి కృషి చేస్తుందని పేర్కొన్నారు. పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి మాట్లాడుతూ మదనపల్లి ఘన చరిత్రకు ల్యాండ్ మార్క్‌గా యూనివర్సిటీ ఏర్పాటు చేయడంపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించడం, ఇందుకుగాను సుమారు రూ.130 కోట్లు ఖర్చు అవుతుందన్నారు. మదనపల్లెను సరస్వతి నిలయంగా మార్చబోతున్నట్లు ప్రకటించారు. మదనపల్లె కేంద్ర విశ్వ విద్యాలయం రానున్నదని, త్వరలోనే మంజూరు చేస్తు ఆర్డర్ కాపీ విడుదల కానున్నందని ప్రకటించారు.

నేడు వైఎస్ఆర్ రైతు భరోసా పంపిణీ

రాయచోటి : ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 1న రాయచోటి జిల్లా ప్రధాన కేంద్రంలో వైఎస్ఆర్ రైతు భరోసా-పిఎం కిసాన్‌ను మొదటి విడత లబ్ధి పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ గిరీష పిఎస్ పేర్కొన్నారు. 1న ఉదయం 10 గంటలకు రాయచోటి నందలి సుండుపల్లి రోడ్డు నారాయణ కల్యాణమండపంలో నిర్వహించే కార్యక్రమంలో జిల్లాలో 202094 మంది రైతులకు రూ.151.96 కోట్ల మేర ముఖ్యమంత్రి చేతుల మీదుగా వర్చువల్ విధానంలో రైతు భరోసా పిఎం కిసాన్ లబ్ధి విడుదల చేస్తారన్నారు. 2023 మార్చి, ఏప్రిల్, మే మాసాలలో కురిసిన అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన 1344 మంది రైతులకు రూ. 179.16 కోట్ల మేర పంట నష్టపరిహారం కూడా విడుదల చేస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, ప్రజలు అందరూ పాల్గొని జయప్రదం చేయవలసిందిగా పేర్కొన్నారు.

తీర్థ, విహార యాత్రలను విస్తరించాలి : ఆర్ఎం

పీలేరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా రవాణా శాఖ చేపడుతూన్న విజ్ఞాన, విహార, తీర్థ యాత్రల సమాచారం క్షేత్రస్థాయికి విస్తరింప చేయడానికి అందరూ కృషి చేయాలని అన్నమయ్య జిల్లా ప్రజా రవాణాధికారి రాము తెలిపారు. బుధవారం ఆయన ప్రజా రవాణా విభాగంలో విధులు నిర్వహిస్తూన్న ఉద్యోగులు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ సిబ్బందితో డిపో మేనేజర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఆదాయ అభివృద్ధికి అనేక మార్గాలను అన్వేషిస్తూందని, లాజిస్టిక్ విభాగంలో అనూహ్య విజయం సాధించామన్నారు. అన్ని డిపోల నుంచి కూడా తక్కువ ఖర్చుతో తీర్థ, విహార, విజ్ఞాన యాత్రలను కూడా చేపడుతున్నట్లు చెప్పారు. ప్రజలు తమ కుటుంబాల్లో జరిగే వివాహాది శుభకార్యాలకు ఆర్టీసి బస్సులు అద్దెకు తీసుకునే సౌలభ్యం కూడా కల్పించినట్లు తెలియజేశారు. ప్రజా రవాణా శాఖ ఉద్యోగులు ఈ విషయాలను గ్రామీణ స్థాయికి విస్తృతపరచాలని ఆదేశించారు. విజ్ఞాన యాత్రలకు వచ్చేది విద్యార్థులకు ఆయా మార్గాల్లోని ఇతర ప్రదేశాలను కూడా చూపుతూ వారి విజ్ఞానాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. సమావేశంలో డిపిటిఒ పిఐ హరి, పీలేరు డిపో మేనేజర్ బండ్ల కుమార్, సిఐ ధనుంజయులు, ఎస్బిఐ, టిఐ-2, టిఐ-3, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు కెవి రమణ, గండికోట ప్రమీల, కంట్రోలర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్‌టిసి ఆర్ఎం రాము


సిసి రోడ్ల శాంపిల్స్‌ను సేకరిస్తున్న క్వాలిటీ కంట్రోల్ బృందం

సిసి రోడ్ల నాణ్యత పరిశీలన

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల పరిధిలో ఇటీవల వేసిన సిమెంట్ రోడ్ల నాణ్యతను క్వాలిటీ కంట్రోల్ బృందం పరిశీలించినట్లు పంచాయతీరాజ్ ఇన్‌ఛార్జి ఎఇఇ వరప్రసాద్ తెలిపారు. బుధవారం మదనపల్లి పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ కార్యాలయం నుంచి క్వాలిటీ కంట్రోల్ ఎఇఇ ప్రసాద్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని రాచవేటివారిపల్లి, దిగువపల్లి, వెంగంవారిపల్లి గ్రామాలలో ఇటీవల వేసిన సిమెంట్ రోడ్ల నాణ్యత ప్రమాణాలను పరిశీలించినట్లు తెలిపారు. జిల్లా పరిషత్ నిధులు రూ.11 లక్షల ను వెచ్చించి రాచవేటివారి పల్లెలో110 మీటర్లు, దిగువపల్లిలో 92 మీటర్లు, వెంగంవారిపల్లెలో 94 మీటర్ల సిసి రోడ్డు నిర్మాణ పనులను చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఎంబుక్‌లో నమోదుకు, క్షేత్రస్థాయిలో వేసిన సిసి రోడ్ల మీటర్లను పరిశీలించారు. నాణ్యత పరిశీలనలో భాగంగా ప్రతిచోట శాంపుల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపించినట్లు పేర్కొన్నారు. అనంతరం కాంట్రాక్టర్లకు నిధులను విడుదల చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఇన్‌ఛార్జి ఎఇఇ వరప్రసాద్, క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

సచివాలయానికి రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని చిన్నగొల్ల పల్లె గ్రామపంచాయతీలో సచివాలయానికి రోడ్డు కావాలని ప్రజలు కోరగా వెంటనే స్పందించిన సర్పంచ్ జయ చంద్ర రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. ఈ రోడ్డు ఏర్పాటు వల్ల చిన్న గొల్లపల్లె ప్రజలకు ఇటు సచివాలయానికి సమస్య తీరుతుందని అన్నారు. చిన్న గొల్లపల్లెకు రింగ్‌రోడ్డు ఎర్పడటం జరిగిందని, ప్రజలు సాను కూలంగా స్పందిం చారని సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామంలో పూజారి వాండ్లపల్లె, కోమటిపల్లె, తుంగూటు వడ్డెపల్లె, రాచయ్యగారిపల్లెలకు రోడ్డు లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని అధికారుల దృష్టికి తీసుకెళుతున్నుటు తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీర్ రాచరాయుడు, రెడ్డిచెర్ల వెంకటేష్, రవి, ఆదినారాయణ, నాగార్జున, చిన్నప్ప, తిమ్మయ్య సురేష్ కుమార్ రెడ్డి, వెంకటప్ప నాయుడు పాల్గొన్నారు.


జెసిబితో రోడ్డు నిర్మాణ పనులు చేయిస్తున్న సర్పంచ్

970 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు మంజూరు

సుండుపల్లి : మండలంలోని 14 గ్రామపంచాయతీలుగాను 970 మంజూర య్యాయని ఎఒ మురళీధర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రకాల విత్తన కాయలు వచ్చాయని ఒకటి నారాయణ కె6, వేరుశెనగకాయలు రెండు రకాల విత్తనకాయలు వచ్చాయని, ప్రస్తుతం ఎర్రగాయలు ఇస్తున్నామని తమ పట్టాదారు పాసుబుక్ తీసుకుని వారి సచివాలయాలకు ఒక బస్తాకు రూ.1770 రూపాయలు త్వరలోనే ఇంకా అదనంగా 700 క్వింటాళ్ళు మంజూరుకు ప్రభుత్వానికి నివేదిక పంపామని తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

3న విత్తన పంపిణీ

కలికిరి : స్థానిక మండలంలోని అన్ని గ్రామ సచివాలయ పరిధిలోని రైతు భరోసా కేంద్రాలలో జూన్ మూడవ తేదీ నుంచి వ్యవసాయ రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ జరుగుతుందని వ్యవసాయ అధికారి మమతారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆర్‌బికె సిబ్బంది రైతులకు విత్తనాలు పంపిణీ చేసే కార్యక్రమంలో భాగంగా పాటించవలసిన పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని వ్యవసాయ రైతులకు నారాయణి రకం అందుబాటులో ఉంటుందని, 30 కేజీల బస్తా రూ.1773లు చెల్లించి తీసుకోవలసిందిగా కోరారు. రైతులు వేరుశనగ విత్తనాల కొరకు వచ్చే సమయంలో తమ వెంట ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్ వెంట తీసుకునే రావాలని కోరారు.

వైకుంఠ రథాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కురబ సామాజిక సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైకుంఠ రథాన్ని బుధవారం మదనపల్లి ఎమ్మెల్యే నవాజ్‌బాషా ప్రారంభించారు. పట్టణంలోని గొల్లపల్లి సర్కిల్ గ్రంథాలయశాఖ ఎదుట ఏర్పాటు చేసిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మదనపల్లి డివిజన్ పరిధిలోగల కురవ సంఘం ప్రతినిధులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కురబలు సామాజిక సేవా కార్యక్రమాలలో భాగస్వాములు కావడం ఆనందంగా ఉందన్నారు. వారంతా కలిసి వైకుంఠ రథాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజారెడ్డి మాట్లాడుతూ కురబలంతా ఐకమత్యంతో ఏర్పాటు చేసిన వైకుంఠ రథం ప్రారంభోత్సవానికి హాజరుకావడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం కురబ కార్పొరేషన్ డైరెక్టర్ దండు రామాంజులు మాట్లాడుతూ మానవుడు మృతి చెందిన తర్వాత తన ఆఖరి మజిలీని మంచిగా జరిగేందుకు ఈ వైకుంఠ రథం ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో కురబ సంఘం డివిజన్ అధ్యక్షుడు చింతల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మర్రిపాటి రమేష్, కోశాధికారి బత్తుని రెడ్డెప్ప, కార్పొరేషన్ డైరెక్టర్లు దండు రామాంజులు, కొప్పల నరసింహులు, మాజీ కౌన్సిలర్లు, కప్పల వెంకటరమణ, కప్పల శ్రీరాములు, జిల్లా కార్యదర్శి బెల్లేరెడ్డి ప్రసాద్, ఎంపిటిసి బెల్లే హారతి, మాజీ ఎంపిపి వల్లిగట్ల వెంకటరమణ, మేజారి వెంకటరమణ, మేజారి సదాశివ, జీ.వి.శివ కుమార్, బండిరెడ్డెప్ప, సహదేవ పాల్గొన్నారు.

ప్రజా సేవే లక్ష్యం

పుల్లంపేట : ప్రజాసేవే తన లక్ష్యమని మహాజన రాష్ట్ర సమితి రాష్ట్ర వర్కింగ్ స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి తాళ్లపాక సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలోని రంగంపల్లి, చిట్వేలి, తిమ్మయ్యగారిపల్లి తదితర గ్రామాలలో ఆయన గత నాలుగు రోజులుగా విస్తృత పర్యటన చేశారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని తనను ఎమ్మెల్యేగా గెలిపించి ఆశీర్వదించాలని అభ్యర్థించారు. తనను గెలిపిస్తే నియోజకవర్గంలో విద్య, ఆరోగ్యం, ఉపాధి రంగాలలోనూ ప్రజలకు మెరుగైన సేవలందిస్తానని అన్నారు. కుల, మత, వర్గ, లింగ బేధాలు చూడకుండా అన్ని వర్గాల ప్రజలకు సమ న్యాయం చేసి ప్రజల ఋణం తీర్చుకుంటానని అన్నారు. కార్యక్రమంలో మహాజన రాష్ట్ర సమితి రాష్ట్ర యువజన అధ్యక్షులు లేబాకు మస్తానయ్య, జిల్లాఅధ్యక్షులు పోలేపల్లి హేమంత్ కుమార్, రాగిపాటి పెంచలయ్య, పోలేపల్లి పెంచలయ్య పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్ర పటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - రాయచోటి

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా, టిడిపి పట్టణ మహిళా అద్యక్షురాలు నాగవేణి, టిడిపి మహిళ నాయకురాలు నసీబ్ జాన్, లక్ష్మీ దేవి బుధవారం టిడిపి పార్టీ కార్యాలయంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఖాదర్‌బాషా మాట్లాడుతూ 18 నుంచి 59 ఏళ్ల వయసున్న మహిళలకు ఆడబిడ్డ నిధి కింద ప్రతి నెల రూ. 1500, తల్లికి వందనం కింద ఇంట్లో ఎంతమంది చదువుకున్న పిల్లలు ఉంటే అంత మందికి రూ.15 వేల ప్రోత్సాహకం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచిత మహిళలు జిల్లా పరిధిలో ఆర్‌టిసి బస్సులో ఎక్కడికి ప్రయాణించినా ఉచితం, ఇద్దరి కంటే సంతానం ఎక్కువ ఉంటే స్థానిక సంస్థల్లో పోటీ చేయడానికి అనర్హులు అటువంటి నిబంధనలను తొలగింపు, పరిశ్రమలు కంపెనీలు తేవడం ద్వారా ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పన, ఉద్యోగాలు వచ్చేదాకా నిరుద్యోగ యువతకు ప్రతినెలా రూ.1500 చొప్పున నిరుద్యోగ భృతి వంటి పథకాలను మేనిఫెస్టోలో అమలు చేయడం హర్షనీయమన్నారు.కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు ఖాదరవల్లి, రాజంపేట పార్లమెంటరీ కార్య నిర్వాహక కార్యదర్శి కొట్టే చలపతి, రాజంపేట తెలుగు యువత కార్యదర్శి జావిద, మహిళ నాయకురాలు రుక్మి నమ్మ ,భార్గవి , రమణమ్మ, పాల్గొన్నారు.

ఇసుక మాఫియా అంతు చూద్దాం

-టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-కలికిరి

ఇసుక మాఫియా అంతు చూద్దామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి రైతులకు పిలుపునిచ్చారు. మహల్ ఇసుక రీచ్‌ను టిడిపి నాయకులతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్ర రెడ్డి ఇసుక మాఫియాగా మారి అక్రమంగా టిప్పర్లతో ఇతర రాష్ట్రాలైన చెన్నై, బెంగళూరుకు తరలించి కోట్లాది రూపాయలు ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. వారితోపాటు వైసిపి నాయకులు నిబంధనలకు విరుద్ధంగా ఇసుక అక్రమ రవాణా చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని, టిడిపి ప్రభుత్వంలో ప్రజలకు ఉచితంగా ఇసుకను అందిస్తే, ఈ ప్రభుత్వం స్థానికులకు ఇసుక లేకుండా చేసి బయట తరలించి కోట్ల రూపాయలు ఆదాయం గడిస్తున్నారని, అంతేకాకుండా వోల్టా నిబంధనలను అతిక్రమించి భూగర్భ జలాలకు విఘాతం కలిగే విధంగా ఉందన్నారు. గ్రామాలలో తాగునీటికి ఇబ్బందికరంగా మారుతుందని, ఇసుక బావిలో చుట్టుపక్కల గ్రామాల రైతును కూడా పడి పోయి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజులు క్రితం ఇసుక బావిలో పడి మృతిచెందిన యువకుడికి రూ.50 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ఇసుక మాఫియా పై కమిటీ వేసి అక్రమార్కులను పై క్రిమినల్ కేసులు నమోదు చేసి అక్రమంగా సంపాదించిన సొమ్ము సొమ్మును రికవరీ చేస్తామని తెలిపారు. కదిరి మేజర్ పంచాయతీ సర్పంచ్ ప్రతాప్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా కలిగిరి మండలంలో వైసిపి నాయకులు ఇసుక మాఫియాగా ఏర్పడి స్థానికులకు ఇసుక లేకుండా చేసి బయటి ప్రాంతాలకు అక్రమంగా ఇసుకను టిప్పర్లతో తరలించి లక్షల రూపాయలు సంపాదించి ప్రజలకు మోసం చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా వైసిపి నాయకులు ఇసుక దోపిడీ ఆపకపోతే ప్రజలు, రైతులు వారిని తరిమికొట్టే పరిస్థితి త్వరలోనే వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు నిజాముద్దీన్, ఉపాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, మాజీ ఎంపిటిసి సతీష్‌రెడ్డి, నాయకులు సహదేవరెడ్డి, ముస్తఫా హజరత్, అగస్తేశ్వర్, శ్రీనివాస్ వర్మ, మున్వర్ అలీ, షబ్బీర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మహల్ ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న నల్లారికిషోర్‌కుమార్‌రెడ్డి

పొగాకు వినియోగం ఆరోగ్యానికి చేటు : డిఎంహెచ్ఒ


ర్యాలీని ప్రారంభిస్తున్న వైద్యాధికారులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పొగాకు వినియోగం ఆరోగ్యానికి చేటు మాత్రమే కాకుండా జీవితాల్ని బుగ్గిపాలు చేస్తుందని, పొగలేని భవిష్యత్తు భావితరాలకు అందించడమే మన కర్తవ్యంగా కృషి చేద్దామని డిఎంహెచ్ఒ కొండయ్య పేర్కొన్నారు. పొగాకు రహిత సమాజం కోసం కృషి చేద్దామని డిప్యూటీ డిఎంహెచ్ఒ చెన్నకృష్ణ, రాష్ట్ర సిహెచ్ఒ గౌరవ అధ్యక్షులు, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పిల్లి పిచ్చయ్య పిలుపునిచ్చారు. బుధవారం ప్రపంచ పొగాకు దినోత్సవం సందర్భంగా డిప్యూటీ డిఎంహెచ్ఒ చెన్నకృష్ణ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి నుంచి ఆర్‌టిసి బస్టాండ్ మీదుగా అమ్మవారిశాల వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చుట్ట, బీడీ, సిగరెట్ సోకులకు భ్రమ పడిపోయి పొగాకులోని నికోటిన్‌కు బలైపోకూడదన్నారు. ప్రస్తుతం మనిషికి కావలసింది ఆరోగ్యం మాత్రమేనని పొగాకు కాదన్నారు. పొగాకు వద్దు ఆరోగ్యమే ముద్దు అంటూ ప్రజలకు సందేశమిచ్చారు. ముఖ్యంగా నేటి యువత పొగాకు అలవాటు పడి జీవితాలను బుగ్గిపాలు చేసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజలు కూడా పొగాకు పై అవగాహన పెంచుకొని పొగాకు రహిత సమాజం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైద్యులు లక్ష్మీ ప్రసన్న, మస్తానీ, అశోక్, వికాస్, టిబి సూపర్వైజర్ జయప్రకాష్, యుడిసి సిద్ధరామయ్య, నీరజ, శివరాం, గుర్రప్ప పాల్గొన్నారు. **కలకడ :** పొగాకు ఉత్పత్తుల వాడకం ఆరోగ్యానికి అనర్థమని కలకడ, ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు మల్లికార్జున, కిషోర్ కుమార్‌రెడ్డిలు పేర్కొన్నారు. మండల కేంద్రమైన కలకడ, పాపిరెడ్డిగారిపల్లెలో ప్రపంచ పొగాకు నివారణ దినోత్సవం సందర్భంగా సిబ్బందిచే ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ జి.జయరామ య్య, వెంకటేశు హెల్త్ ఎడ్యు కేటర్ రాజమ్మ, హెల్త్ సూపర్వైజర్ వెంకటేశ్వరరావు పిహెచ్ఎన్ సుబ్బరత్న, సూపర్వైజర్లు ముజీబ్‌బాషా, రెడ్డమ్మ ల్యాబ్ టెక్నీషియన్ జమీల్‌అహ్మద్, ఫార్మాసిస్ట్ షరీఫ్, భాగ్యలక్ష్మి ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పిలు పాల్గొన్నారు.**వాల్మీకిపురం :** పొగాకు ద్వారా ప్రాణాంతక వ్యాధులు సంభవిస్తాయని ప్రజలు గమనించి వాటికి దూరంగా ఉండాలని వాల్మీకిపురం జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు ప్రభు చరణ్ అన్నారు. పొగాకు వ్యతిరేఖ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక గాంధిబస్టాండ్, ఆర్‌టిసి బస్టాండ్ వద్ద కరపత్రాలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగతాగడం వలన స్వరపేటిక, నాలుక, గొంతు, ఆహారనాళం దెబ్బతినడంతో పాటూ ఊపిరితిత్తులలో కేన్సర్‌వ్యాధి సోకే ప్రమాదం ఉందన్నారు. కుటుంబాల్లో కూడా దుర్భర పరిస్థితులు ఉత్పన్నమవుతాయని అన్నారు. 48శాతం విద్యార్థులు పొగాకు ఉత్పత్తులకు బానిసలుగా మారి జీవితాలను దుర్భరం చేసుకుంటున్నారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మరణిస్తున్న 80లక్షల మందిలో 10.2 లక్షల మంది పొగాకు వాడేవారే ఉన్నారన్నారు. మన దేశంలో 48శాతం మగవారికి, 10శాతం ఆడవారికి పొగతాగే అలవాటు ఉందన్నారు.

రీ సర్వేతో శాశ్వత పరిష్కారం : జెసి

ప్రజాశక్తి-కలికిరి

రీసర్వే తో రైతులకు భూ సమస్యలపై శాశ్వత పరిష్కారం దొరుకుతుందని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. స్థానిక మండల కేంద్రంలోని గుండ్లూరు, మేడికుర్తి పంచాయతీలలో జరుగుతున్న రీసర్వే కార్యక్రమాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ డ్రోన్ సహాయంతో తీసిన చిత్రాలపై భూమిమీద రీసర్వే జరుగుతున్న సమయంలో సంబంధిత రైతులు తమ పాస్ బుక్కులు, దస్తావేజులు గాని చూపించి తమకు ఉన్నటువంటి సమస్యలను అధికారుల ద్వారా పరిష్కరించుకోవాలని తెలిపారు. చిన్న చిన్న తగాదాలు, భాగ పరిష్కారాలు, తదితర సున్నితమైన సమస్యలు, లేకుండా అధికారులకు రైతుల సహకరించి ఈ సర్వేకి సహాయ సహకారాలు అందించాలని కోరారు. అనంతరం మేడికుర్తి గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయం సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ సచివాలయ పరిధిలో ఉన్నటువంటి సమస్యలను రైతులకు అనుగుణంగా కాలయాపన లేకుండా చూడాలని దరఖాస్తులు, సచివాలయ పరిధిలో స్పందన సమస్యలపై వెంటనే స్పందించాలని, ఏ విషయంలో కూడా కాలయాపన చేయకుండా వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ భాగ్యలత, డివిజనల్ సర్వేయర్ కృష్ణమూర్తి, మండల సర్వేయర్ దేవి, సచివాలయ సర్వేయర్లు, విఆర్ఒ శంకరయ్య, రైతులు పాల్గొన్నారు.


రీసర్వేలో రికార్డుల పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

సిఎం సహాయనిధి పేదలకు వరం :'గడికోట'

ప్రజాశక్తి-రామాపురం

సిఎం సహాయనిధి పేదలకు వరం లాంటిందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గోపగుడిపల్లె గ్రామం గాజులపేట కు చెందిన వర్ధంశెట్టి ప్రభాకర్ కుమార్తె గురులక్ష్మి(4) తలసేమియా తో బాధపడుతోంది.ఈ చిన్నారి వైద్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.15 లక్షలు విలువ చేసే ఎల్ఒసి లేటర్‌ను బుధవారం ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి బాధిత కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా చిన్నారి గురులక్ష్మి తండ్రి ప్రభాకర్ మాట్లాడుతూ గురులక్ష్మికి సంవత్సరం వయస్సున్నప్పుడే తలసేమియా జబ్బు బయట పడడంతో కర్నూలు, తిరుపతి, కడప బెంగుళూరు లలో వైద్యం చేయించినా మెరుగుపడలేదు. బోన్ మ్యారో చేస్తేనే ఆరోగ్యం మెరుగు అవుతుందని, ఇందుకు లక్షలాది రూపాయలు ఖర్చు అవుతుందని హైదరాబాద్ లోని సిటిజన్స్ అమెరికన్ ఆంకాలజీ వైద్యులు సూచించారన్నారు. నిరుపేదలైన తాము ఎమ్మెల్యేను కలిసి తమ బిడ్డ పరిస్థితి గురించి వివరించామన్నారు. ఆయన తక్షణమే స్పందించి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయాన్ని అందిస్తామని భరోసా ఇచ్చి తమ దరఖాస్తును సిఎం క్యాంపు కార్యాలయానికి త్వరితగతిన తీసుకెళ్లారు. తమ కుటుంబ సభ్యులకు బోన్ మ్యారో టెస్టింగ్ కోసం ముందుగా రూ.1.20లక్షలను ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయించారన్నారు. బోన్ మ్యారో మార్పిడి కోసం ఇప్పుడు రూ.15 లక్షలు నిధులను ప్రభుత్వం నుంచి మంజూరు చేయించారని సిఎం జగన్, ఎమ్మెల్యేల మేలు మరువలేమని తెలిపారు.


చిన్నారి తండ్రికి ఎల్ఒసి లెటర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

అంగన్వాడీ కార్యకర్త సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని గోపిదిన్నె అంగన్వాడీ కేంద్రంలో కార్యకర్తగా రత్నమ్మ చేసిన సేవలు అజరా మరమని సిడిపిఒ నాగ వేణి కొనియాడారు. బుధ్‌వారం అంగన్వాడీ కేంద్రంలో రత్నమ్మ ఉద్యోగ విరమణ సందర్భంగా వీడ్కోలు కార్యక్రమం జరిగింది. రత్నమ్మను సిడిపిఒ నాగవేణి, సూపర్వైజర్‌లు, అంగన్వాడీ కార్యకర్తలు శాలవాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సిడిపిఒ నాగవేణి మాట్లాడుతూ రత్నమ్మ సుదీర్ఘకాలం 40 ఏళ్ల పాటు అంగన్వాడీ కార్యకర్తగా సేవలు అందించడం హర్షణీయమన్నారు. చిన్నపిల్లలకు లాలించి అక్షరాలను దిద్దించి వారి భవిష్యత్తుకు బంగారు బాటలను వేసి గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య సూచనలు సలహాలు ఇచ్చి, కిషోర్ బాలికలకు యుక్త వయసులో ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియపరుస్తూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వారికి అందించి పలువురి మనలను పొందారు. ఆమె శేష జీవితం ఆయురారోగ్యాల్లో సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ శ్వేత, సుమతి, రాధా, అంగన్వాడీ కార్యకర్తలు, ఐసిడిఎస్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఆహారశుద్ధి రంగంలో అవకాశాలను అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి-పీలేరు

ఆహార శుద్ధి రంగంలో ఉన్న అపార అవకాశాలను అందిపుచ్చుకోవడంపై స్వయం సహాయక సంఘాల మహిళలు దృష్టి సారించాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవిచంద్ర తెలిపారు. ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ప్రైజెస్-పిఎంఎఫ్ఎంఇ పథకంపై బుధవారం ఆయన పీలేరు వెలుగు కార్యాలయంలో సంఘమిత్రలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహార ఉత్పత్తులను విలువ ఆధారిత ఉత్పత్తులుగా మలచడం ద్వారా వాటి ధరలు పెరగడమే కాకుండా పరోక్షంగా రైతులు, మహిళలకు ఆర్థిక ప్రయోజనం కలుగుతుందన్నారు. జిల్లాలో అధికంగా పండే మామిడి, టమోటా, బొప్పాయి, అరటి పంటలను ఆధారం చేసుకుని ఆహార శుద్ధి పరిశ్రమలు ఏర్పాటు చేస్తే లాభసాటిగా ఉంటుందని, ఇప్పటికే అనేక రంగాల్లో విజయం సాధించిన డ్వాక్రా మహిళలు ఈ రంగంపై కూడా దృష్టి సారించాలని కోరారు. మామిడి పండు నుంచి మామిడి తాండ్ర, గుజ్జు, జ్యూస్ వంటి ఉత్పత్తులు, టమోటా నుంచి కెచప్, సాస్, పౌడర్, ఎండు టమోటా వంటి ఉత్పత్తులు తయారు చేసి విక్రయించడం వల్ల మహిళల ఆర్థిక, జీవన ప్రమాణాలు మెరుగు పడతాయన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పిఎంఎఫ్ఎంఇ పథకం ద్వారా ఆహార శుద్ధి రంగంలో నూతన యూనిట్లు ఏర్పాటు చేయడానికి యూనిట్ విలువలో 10 శాతం మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందని, మిగిలిన 90 శాతాన్ని బ్యాంకులు రుణంగా అందజేస్తారన్నారు. యూనిట్ విలువలో 35 శాతం సబ్సిడీ ఉంటుందని రూ.10 లక్షల వరకు బ్యాంకులకు ఎటువంటి షూరిటి చూపించాల్సిన అవ సరం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు బోధి షావలి, ఎపిఎం లక్ష్మణ్ రెడ్డి, హెచ్ఒ సుకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

టపాసుల దుకాణాలకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

టపాసుల దుకాణాలకు అనుమతి తప్పనిసరని ఎస్ఐ మల్లికార్జున్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఎవరైనా టపాసులు విక్రయిస్తే ఎస్‌పి ఆదేశాల మేరకు కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలపై వాహన దారులు తగు జాగ్రత్తలు తీసుకోవడం సురక్షిత ప్రయాణం చేయవచ్చని అన్నారు.హెల్మెట్ ధరించి ప్రమాదాల బారిన పడకుండా చూసుకోవాలన్నారు. వ్యాపారస్తులు సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వేసవిలో ఊర్లకు వెళ్లే దుకాణదారులు, ఇంటి యజమానులు కానీ వారి ఇళ్లల్లో ఉండే విలువైన బంగారు ఆభరణాలు, నగదు వారి వెంట తీసుకువెళ్లాలని సూచించారు.

వివాహ వేడుకల్లో 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణ శివారులోని ఎస్.ఆర్ కళ్యాణ మండపంలో బుధవారం గంగినేని వివాహ వేడుకలకు నియోజకవర్గ టిడిపి నాయకులు చమర్తి జగన్మోహన్‌రాజు హాజరైన నూతన వధూవరులు ప్రణవానంద కుమార్, కవితను ఆశీర్వదించారు. ఈ వేడుకల్లో ఆయన వెంట చంద్రశేఖర్ నాయుడు, రాజంపేట టిడిపి మండల ఉపాధ్యక్షులు ఊటుకూరు సతీష్‌రాజు, యువ నాయకులు పరుశురాం నాయుడు, టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు పోలి శివకుమార్, నాగేంద్ర, బ్రహ్మణపల్లె కొమ్మి సాంబ శివయ్య నాయుడు, శేషారెడ్డి, కేతా రాజశేఖర్, వినోద్‌రెడ్డి పాల్గొన్నారు.


వివాహావేడుకల్లో పాల్గొన్న చమర్తి జగన్మోహన్‌రాజు

క్రైం కార్నర్


వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి చైతన్య


స్వాధీన పరచుకున్న ఆభరణాలు

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

బంగారు, వెండి నగలు స్వాధీనం : డిఎస్‌పి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట పట్టణం టి.అగ్రహారానికి చెందిన చెందిన ముద్దపోలు నవీన్ కుమార్ అనే అంతర్రాష్ట్ర దొంగను పట్టణ పోలీసులు ఈనెల 22వ తేదీన అరెస్టు చేసి అతని వద్ద నుంచి బంగారు, వెండి ఆభరణాలు స్వాధీన పరచుకున్నారు. బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డిఎస్‌పి చైతన్య దొంగతనానికి చెందిన వివరాలను వెల్లడించారు. టీ.అగ్రహారానికి చెందిన నవీన్ కుమార్ పై గతంలోనే 12 దొంగతనాల కేసులు ఉన్నాయని తెలిపారు. పలు దొంగతనాలకు పాల్పడుతున్న నవీన్ కుమార్‌ను 22వ తేదీన టీ అగ్రహారానికి వెళ్లే దారిలో అదుపులోకి తీసుకొని అతని వద్ద నుండి రెండు కెనాన్ కెమెరాలను స్వాధీన పరుచుకుని విచారించగా వెండి, బంగారు ఆభరణాల దొంగతనాలకు కూడా పాల్పడినట్లు వెల్లడించాడని తెలిపారు. అతని వద్ద నుంచి వెండి పాత్ర, చెంబు, దీపపు కుందులు, గిన్నెలు, కుంకుమ భరణి, లక్ష్మీదేవి విగ్రహాలు, వెండి బిల్లలు, గంధం గిన్నెలు వంటి రూ లక్ష 15 వేలు విలువ చేసే తదితర వెండి వస్తువులతో పాటు, రూ 18 వేలు విలువచేసే బంగారు ఉంగరం కూడా స్వాధీనం చేసుకోవడం జరిగిందని అన్నారు. ముద్దాయిని కోర్టుకు హాజరు పరచనున్నట్లు తెలిపారు. ప్రజలు తమ ఇళ్లకు సిసి కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐలు వెంకటేశ్వర్లు, లక్ష్మీప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

టపాసుల దుకాణం సీజ్

ఎటువంటి అనుమతులు లేకుండా టపాసులు విక్రయిస్తున్న దుకాణాన్ని సీజ్ చేసినట్లు డిఎస్‌పి చైతన్య వెల్లడించారు. ఎస్‌పి గంగాధర్‌రావు ఆదేశాల మేరకు పట్టణంలో తనిఖీలు నిర్వహిస్తుండగా బంద్రాళ్లవీధిలో అనుమతులు లేకుండా పచ్చి పులుసు లక్ష్మీనారాయణ విక్రయిస్తున్న టపాసుల దుకాణాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. సీజ్ చేసిన టపాసుల విలువ రూ 1.76 లక్షలు ఉంటుందని తెలిపారు. అనుమతులు లేకుండా టపాసులు, పేలుడు పదార్థాలను విక్రయించడం, తయారు చేయడం, నిల్వ ఉంచుకోవడం నేరమని.. అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


స్వాధీనం చేసుకున్నఎర్రందనం, అరెస్టయిన నిందితుడితో పోలీసులు

పోలీసుల అదుపులో ఎర్రచందనం నిందితుడు

- రూ.9.80 లక్షల విలువచేసే దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న ఓ నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. మదనపల్లి రూరల్ సిఐ శివాంజనేయులు, బి.కొత్తకోట ఎస్ఐ రామ్మోహన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎస్‌పి గంగాధర్‌రావు, మదనపల్లి డిఎస్‌పి కే.కేశప్ప ఆదేశాల మేరకు ఎర్రచందనం అక్రమ రవాణాపై దాడులు నిర్వహించామన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణాలో ఎ3 నిందితుడిగా ఉన్న పూల విజయ్ కుమార్ రాయచోటి పట్టణంలోని సుదర్శన్ అనే వ్యక్తి దగ్గర జెసిబి డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడని తెలిపారు. చెడు అలవాట్లకు బానిసైన విజయ్‌కుమార్ జెసిబి డ్రైవర్ వృత్తి వలన వచ్చే డబ్బులు సరిపోవడం లేదని, ఇతని మామ అయిన ఎ1 నిందితుడిగా ఉన్న మల్లికార్జునతో చెప్పారని తెలిపారు. మల్లికార్జున నీకు డ్రైవింగ్ వచ్చు కదా నువ్వు నాతోపాటు వస్తే ఒక లోడుకు రూ.20వేలు ఇస్తానని చెప్పాడని అందుకు విజయ్ కుమాం ఒప్పుకున్నట్లు తెలిపారు. సుమారు మూడు నెలల కాలంగా ఎర్రచందనం దుంగలను ఎవ్వరికి అనుమానం రాకుండా కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరు సమీపంలోని కటికనల్లిలో ఉన్న ఎ2 నిందితుడిగా ఉన్న నవీద్‌బాషాకు విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం రాత్రి మల్లిఖార్జున విజయ్ కుమార్‌కు ఫోన్ చేసి,నేను ఎర్రచందనం దుంగలను తీసుకొని వచ్చి నూలివీడు రోడ్డు దగ్గర గల దొడ్లడైరీ ప్రక్కన కాలువలో దాచి పెట్టినానని, నువ్వు వస్తే దానిని తీసుకొని కటికనల్లిలో గల నవీద్ బాషా దగ్గర దించి వద్దామని చెప్పాడు. అందుకు ఇతను సరేనని ఒప్పుకున్నాడని చెప్పారు.ఈ విధంగా ఎర్రచందనం అక్రమంగా తరలిస్తూ మంగళవారం మధ్యాహ్నం సుమారు 12 గంటలకు మదనపల్లి డిఎస్‌పి ఆధ్వర్యంలో ఎర్రచందనం అక్రమ రవాణా గురించి తనకు రాబడిన ఖచ్చితమైన సమాచారం మేరకు పోలీసు సిబ్బందితో కలిసి మండలంలోని మొరవపల్లి క్రాస్, బి.కొత్తకోట-బెంగుళూరు రోడ్డు హెరిటేజ్ ముందు వాహన తనిఖీ నిర్వహిస్తుండగా నిందితుడిగా ఉన్న పూల విజయ్‌కుమార్‌ను అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 11 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ రూ.9.80 లక్షలు ఉంటుందని చెప్పారు. ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలించుటకు వాడిన ఒక బొలెరో మాక్సీ లగేజీ స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న ఎ1,ఎ -2లను త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు. ఎర్రచం దనం అక్రమ రవాణా చాకచక్యంగా అడ్డుకున్న రూరల్ సిఐ, ఎస్ఐ, ఎఎస్ఐ నరసింహనాయక్, హెడ్ కానిస్టేబుల్ రవీంద్ర నాయక్, కానిస్టేబుల్ శ్రీనివాసులు, సిబ్బందిని ఎస్‌పి, డిఎస్‌పిలు అభినందించారు.

పేఛానల్ నిర్వాహకులపై కేసు నమోదు

ప్రజాశక్తి-కలకడ

పే ఛానల్ నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పే స్వామి తెలిపారు. ప్రస్తుతం రాయచోటిలో కాపురం ఉంటున్న శివకుమార్ కోన పంచాయతీ కోన గ్రామంలో జీ పేఛానల్, ఎ టివి కేబుల్ నెట్‌వర్క్‌లను ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తూ ఉండటంతో బొంబాయి నుంచి వచ్చిన యజమానులు పేఛానల్ నిర్వహిస్తున్న విషయం గమనించి నిర్వాహకుడు శివకుమార్‌పై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో వారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శివకుమార్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.